క్లుప్తంగా

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ట్రిపుల్‌ఈ అధ్యాపకులు జి.టి.చంద్రశేఖర్, అందవరపు క్రాంతి బృందం సంయుక్తంగా రాసిన హెచ్‌వీడీసీ పవర్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్స్ పుస్తకాన్ని ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావుతో కూడిన ఫ్యాకల్టీ సభ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రస్తుత సాంకేతిక అంశాలపై పరిశోధన చేసి పుస్తకాలు రాయటం వల్ల విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ పుస్తకాన్ని దక్కన్ ఇంటర్నేషనల్ అకాడమిక్ పబ్లిషర్స్ సంస్థ ప్రచురించిందన్నారు.

కూర్మనాథాలయంలో స్వచ్ఛతే సేవ



చెత్త తొలగిస్తున్న విద్యార్థులు

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథాలయంలో శుక్రవారం స్వచ్ఛతే సేవ కార్యక్రమం నిర్వహించారు. పర్యాటక శాఖ, కేంద్ర యువజన సర్వీసుల ఆధ్వర్యంలో స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని దేవాలయాన్ని శుభ్రపరిచారు. తాబేళ్ల పార్కు, శ్వేతపుష్కరిణి గట్లు, భోజనశాల పరిసరాల్లో చెత్తాచెదారాలు తొలగించారు. అనంతరం నా భూమి-నాదేశం కార్యక్రమం చేపట్టారు. జిల్లా పర్యాటక శాఖాధికారి నడిమింటి నారాయణరావు, నెహ్రూ యువకేంద్రం వెంకటేశ్వర్, సెట్‌శ్రీ ప్రసాదరావు, హెచ్‌ఎం ఎం.దేవరాణి తదితరులు పాల్గొన్నారు.

గణపతి నవరాత్రుల పూర్ణాహుతి



పూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళంకల్చరల్: బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర సుందరి కాలభైరవ పీఠం దేవాలయంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల పూర్ణాహుతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వ్యాసరచన పోటీలు



పరీక్షను పర్యవేక్షిస్తున్న బి.మల్లేశ్వరరావు, శ్రీకాంత్, లక్ష్మణరావు తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సత్యసాయిబాబా శత జయంత్యుత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో శుక్రవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విద్యార్థుల్లో మానవతా విలువలను పెంపొందింపజేసేందుకు 'ఆచార్య దేవోభవ' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోని పెద్ద మందిరం సమితి పరిధిలో పలు పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు జరిగాయి. రాష్ట్రస్థాయిలో శ్రీ సత్యసాయి సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు, సేవాదల్ కోఆర్డినేటర్ సూర రామచంద్రరావు పర్యవేక్షణలో జిల్లాలో వ్యాసరచన పరీక్షను ప్రశాంతంగా పూర్తి చేశారు. శ్రీకాకుళం పీఎన్‌కాలనీలోని న్యూ సెంట్రల్ స్కూల్‌లో విశ్రాంత డీఈఓ బలివాడ మల్లేశ్వరరావు, పాఠశాల డైరెక్టర్ పోలుమహంతి శ్రీకాంత్, సత్యసాయి సేవాసమితి ప్రతినిధి అంపోలు లక్ష్మణరావు, భాస్కరశాస్త్రి, ఇతర సిబ్బంది పర్యవేక్షించారు.

పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు



శ్రీకూర్మం పాఠశాలలో వ్యాసరచన పోటీ

గార: సత్యసాయి సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలో పలు పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'ఆచార్య దేవోభవ' అనే అంశంపై జరిగిన ఈ పోటీల్లో బోరవానిపేట పాఠశాల నుంచి 16 మంది, గార జెడ్పీ హైస్కూల్ నుంచి 21 మంది, కొర్ని నుంచి 17 మంది, సతివాడ నుంచి 10 మంది, శ్రీకూర్మం నుంచి 90 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహార స్టాల్స్ పరిశీలిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్: పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంలోని గుజరాతిపేట ఐసీడీఎస్ అర్బన్ సెంటర్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒకతరం నుంచి ఇంకో తరానికి వచ్చేసరికి అనారోగ్యం, శక్తి లేకపోవడం వంటివి ఇటీవల కాలంలో చూస్తున్నామన్నారు. ఇందుకు కారణం పోషకాహార లోపమేనన్నారు. పేదరికం, సమతుల ఆహారంపై చైతన్యవంతం లేకపోవడం, ఆహారపు అలవాట్లు మారడం కూడా కారణమన్నారు. పౌష్టికాహారంపై తల్లిదండ్రులకు అవగాహన ఉంటేనే శక్తివంతమైన కొత్తతరం సాధ్యమన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టులో చేస్తున్న అంగన్‌వాడీలందరూ కొత్తతరాన్ని తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. స్వాతంత్య్రం వచ్చిన చాలా ఏళ్ల వరకూ చిన్నారుల్లో పోషకాహార లోపం ఉండేదని, ప్రభుత్వాల చర్యల కారణంగా ఇప్పుడిప్పుడే పరిస్థితుల్లో మార్పులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వాస్పత్రులు అందిస్తున్న సేవలపై అందరికీ అవగాహన కలగాలని, గర్భిణులకు సీనియర్ డాక్టర్లను, సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

చంద్రబాబు చేసిందేంటి?

గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏం అభివృద్ధి చేశారో చెప్పగలరా? అని ప్రశ్నించారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏం జరిగిందో తాను చెప్పగలనని తెలిపారు. పట్టణ ప్రజలకు క్రమం తప్పకుండా సురక్షిత తాగునీరు అందిస్తున్నామని, పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్‌ను అభివృద్ధి చేశామన్నారు. పాత రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు వేశామని, సుందరమైన నగరంగా శ్రీకాకుళాన్ని తీర్చిదిద్దామన్నారు. 6 అర్బన్ హెల్త్ సెంటర్స్ నెలకొల్పామని, 900 పడకలతో ప్రభుత్వాస్పత్రిని (రిమ్స్ ఆస్పత్రిని) అభివృద్ధి చేశామన్నారు. ఇవన్నీ ఈ నాలుగేళ్లలో జరిగిన మార్పులేనని పేర్కొన్నారు. దోపిడీ చేసే పార్టీ అధికారంలోకి రావాలని ఎల్లోమీడియాకు ఉందని, ఆ ఉద్దేశంతోనే సంబంధిత సంస్థలు పని చేస్తున్నాయని దుయ్యబట్టారు. తాము అలా కాదని, డీబీటీ ద్వారా రూ.2.30 లక్షల కోట్లను వివిధ సంక్షేమ పథకాల ద్వారా అర్హులకు చేర్చామన్నారు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచంతో మన చిన్నారులు పోటీ పడాలని ఇంగ్లిష్ మీడియంను అందుబాటులో తీసుకువచ్చామన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో ఎవ్వరూ చేయని విధంగా పాలనలో సంస్కరణలు తీసుకుని వచ్చి అమలు చేస్తున్నామని తెలిపారు. ఆశావర్కర్స్ గౌరవ వేతనాన్ని రూ.3 వేల నుంచి రూ.10 వేలకు పెంచినట్లు చెప్పారు. పాత పింఛను విధానం అమలుచేస్తున్న రాష్ట్రాలేవీ లేవని, ఉద్యోగులకు మంచి చేసేందుకే జీపీఎస్ విధానమని పేర్కొన్నారు. అంతకుముందు పౌష్టికాహార స్టాల్స్‌ను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శాంతిశ్రీ, అర్బన్ సీడీపీవో శోబారాణి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్లు మెంటాడ పద్మావతి, పైడిశెట్టి జయంతి, పార్టీ నాయకులు గురుబెల్లి లోకనాథం, పైడి రాజారావు, మండవిల్లి రవి, అంధవరపు సంతోష్, డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలి



మాట్లాడుతున్న ఇబ్రహీం ఖలీల్

ఎచ్చెర్ల క్యాంపస్: మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని రీసోర్సుపర్సన్, ప్లానెట్ సొల్యూషన్స్ సర్వీస్ ఇంజినీర్ ఇబ్రహీం ఖలీల్ అన్నారు. ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులు నిర్వహించనున్న శీతలీకరణం, శీతోష్ణ నియంత్రణ అనే అంశంపై కార్యశాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా విద్యార్థులు ప్రయోగాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విషయ పరిజ్ఞానంపై దృష్టిపెట్టాలని చెప్పారు. కొత్తవిషయాలు, ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విద్యలో ముందుకు సాగాలన్నారు. ఇంజినీరింగ్ విద్య నుంచి రిలీవ్ అయ్యేనాటికి మంచి సంస్థల్లో ప్లేస్‌మెంట్‌లు సాధించేలా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సి.సి.రమణమూర్తి నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ వి.కె.చక్రవర్తి, కెమికల్ విభాగాధిపతి భాస్కరరావు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతో గుండెజబ్బులు దూరం



డాక్టర్ బుడుమూరు అన్నాజీరావును సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: ప్రశాంతంగా ఉంటే గుండె జబ్బులకు దూరంగా ఉండవచ్చని ప్రముఖ కార్డియాలజిస్ట్ బుడుమూరు అన్నాజీరావు అన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో అన్నాజీరావును ఘనంగా సత్కరించారు. కార్యకర్మంలో క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, మెంటార్ నటుకుల మోహన్ పాల్గొన్నారు. జీవన సరళి వ్యాధులపై అవగాహన పెంచుకోవడం ద్వారా హృదయ సంబంధిత వ్యాధుల నుంచి కాపాడుకోగలమని ఆప్తాలిక్ అధికారి, రొటేరియల్ సప్పటి వసంతరావు అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని కస్తూరిబా బాలిక విద్యాలయంలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు గుండె వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులచే కళాశాల ప్రిన్సిపాల్ పల్లి సావిత్రి ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ప్రభావతి జాగృతి ట్రస్ట్ సౌజన్యంతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం/అర్బన్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం రోటరీక్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు ఎరుకోల మురళీమోహన్‌రావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం రోటరీక్లబ్ సెంట్రల్, జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ పాజిటివ్ హెల్త్ అనే నినాదంతో శుక్రవారం ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని రోటరీ అర్బన్ క్లినిక్ సెంటర్‌లో జరిగిన ఈ శిబిరంలో డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ అన్నెపు సంతోష్ హాజరై 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు కొంచాడ సోమేశ్వరరావు, కె.టి.నాయుడు, ఎస్.నాగేశ్వరరావు, దుర్గారావు, కోరాడ వైకుంఠరావు, పి.వాసుదేవరావు, ఎం.వెంకటేశ్వరరావు, టి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

గుండె రక్షణపై అవగాహన

లావేరు: పోతయ్యవలస గ్రామంలో నైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ గుండె దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నైస్ ఫౌండేషన్ వైద్య సిబ్బంది గుండె పదిలంగా ఉంచుకోవడానికి తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యపానం, ధూమపానం, అధిక కొవ్వు కలిగిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం వలన గుండెకు ప్రమాదకరమని.. వాటికి దూరంగా ఉండాలన్నారు.

పోషకాహారంతో మెరుగైన ఆరోగ్యం



పౌష్టికాహారాన్ని ప్రదర్శించిన దృశ్యం

రణస్థలం: పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధ్యమని రణస్థలం ఐసీడీఎస్ పీవో ఝాన్సీ అన్నారు. కోష్ట సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకాహార లోపం తలెత్తకుండా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సంపూర్ణ పోషకాలతో కూడిన 15 పదార్థాలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ఈ సందర్భంగా పలు రకాల పోషక విలువలు గల పదార్థాలను ప్రదర్శించారు. ఏసీడీపీవో సుగుణ, పిషిణి సర్పంచ్ రెడ్డి విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పతివాడ సత్యం, మహిళ పోలీస్ అమ్మాజి బమ్మిడి, ఇన్‌చార్జి సూపర్‌వైజర్ రమా, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

త్యాగధనుల స్మరణలో..

దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు గుర్తుగా శుక్రవారం వాడవాడలా మేరా మట్టి మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీగా వెళ్లి ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించారు. అనంతరం పంచప్రాణ ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



లావేరు: అదపాకలో నామట్టి-నాదేశం కార్యక్రమంలో అధికారులు



గార: జొన్నలపాడు కాలనీ ప్రాథమిక పాఠశాలలో జాతీయ జెండాలతో హెచ్‌ఎం పేడాడ విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడలో నిర్వహిస్తున్న ర్యాలీ

బైబై గణేశా..



నిమజ్జనానికి తరలివెళ్తున్న జె.ఆర్.పురం గణనాథుడు

రణస్థలం: మండలంలోని పలు గ్రామాల్లో పూజలందుకున్న గణనాథుల విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం నిమజ్జనం చేశారు. కొవ్వాడ, అల్లివలస, పైడిభీమవరం గ్రామాల్లో వినాయక నిమజ్జన ఊరేగింపులు ఘనంగా జరిగాయి. జె.ఆర్.పురం రామాంజనేయ థియేటర్ వద్ద అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. జె.ఆర్.పురంలోని తహసీల్దార్ ఆఫీస్ దరి 13 అడుగుల వినాయకుని ఊరేగింపుల్లో అధికంగా భక్తులు పాల్గొని నృత్యాలు చేశారు.

400 సార్లు తిరుమల పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న శ్రీనివాస్

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన మహంతి శ్రీనివాస్ శుక్రవారంతో 400 సార్లు తిరుమల పాదయాత్రను పూర్తిచేశారు. ఆయన 1996 నుంచి తిరుమలకు కాలినడకన వెళ్తున్నారు. ఒక్కో సారి ఒకరోజులో మూడుసార్లు కూడా పాదయాత్ర చేసిన సందర్భాలు ఉన్నాయి. శ్రీవారి అనుగ్రహంతో తాను 400 సార్లు పాదయాత్ర ద్వారా స్వామిని దర్శించుకున్నానని చాలా అదృష్టవంతుడినని అన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మాట్లాడుతున్న వైద్యాధికారులు

లావేరు: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని లావేరు పీహెచ్‌సీ సీహెచ్‌వో పి.రామ్‌ప్రసాద్, పీహెచ్‌ఎన్ సుహాసిని అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షా కాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉంటాయని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో పర్యటించి వ్యాధులు ప్రబలితే వెంటనే వైద్య సేవలు అందించాలన్నారు. పిల్లలు, గర్భిణులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రాణాయామంతో ఒత్తిడి దూరం

శ్రీకాకుళం కల్చరల్: ప్రాణాయామం, యోగా ద్వారా ఒత్తిడి దూరమై సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ నంబాళ్ల కల్పన అన్నారు. నగరంలోని ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం హ్యాపినెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త బ్యాచ్ అక్టోబరు 9 నుంచి ప్రారంభమవుతుందని, కోర్సులో చేరాలనుకునేవారు 95056 77388 నంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో తమ్మినేని రంగనాథ్, రాజు, అజయ్, మధు పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం జరగనున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పాల్గొంటారని అతని కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. అజ్జరాంలో గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ కినిక్ భవనాలను ఆయన ప్రారంభిస్తారు. అలాగే జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు, సీసీ రోడ్లు, డైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. కుప్పిలి గ్రామ సచివాలయలయం -2లో నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు.

గృహ నిర్మాణాల్లో అలసత్వం తగదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు బిల్లు మంజూరు చేయడంలో అధికారుల జాప్యం స్పష్టంగా కనిపిస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఎచ్చెర్ల నియోజకవర్గస్థాయిలో గృహనిర్మాణశాఖ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, లబ్ధిదారులకు బిల్లు మంజూరులో జాప్యం నెలకుంటున్నట్లు తరచూ ఫిర్యాదులు వస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనితీరు మెరుగుపర్చుకొని శత శాతం గృహ నిర్మాణాలు జరిగేటట్లు చూడాలన్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి సాంకేతిక సమస్యలుంటే పరిష్కరించాలన్నారు. సమావేశంలో హౌసింగ్ డీఈ అప్పారావు, ఏఈలు మోహనరావు, అప్పలనాయుడు, రాజేంద్రప్రసాద్, రమేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి, నాలుగు మండలాల నాయకులు ఉన్నారు.

అభివృద్ధి జరగడం లేదన్నది దుష్ప్రచారమే

- రోడ్డు పనుల శంకుస్థాపన సభలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



ఎస్‌బీఐ కాలనీలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్రంలో అభివృద్ధి జరగడం లేదన్నది ప్రతిపక్షాల దుష్ప్రచారమేనని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని ఎస్‌బీఐ కాలనీలో రూ.20లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతీ సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులు చేసేందుకు రూ.20లక్షలు మంజూరు చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని గుర్తు చేశారు. డబ్బులు పంచడం తప్ప అభివృద్ధి లేదని ప్రతిపక్ష టీడీపీ నేతలు, వారి భజన బృందం ఎల్లోమీడియా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. స్వాతంత్య్రనంతరం శ్రీకాకుళం జిల్లాకు ఒకేసారి రూ.4వేల కోట్లు నిధులిచ్చి అభివృద్ధి చేసిన ప్రాజెక్టు ఇప్పటివరకు ఎవరూ చేయలేదని, ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే మూలపేట పోర్టుకు ఇంత మొత్తంలో ఏప్రిల్‌లో శంకుస్థాపన చేసి పనులు చకచకా చేయిస్తున్నారని వివరించారు. గతంలో వంశధార ప్రాజెక్టుకు రెండువేల కోట్లు ఇచ్చినప్పటికి 50 ఏళ్లదాటి పనులు చేస్తునే ఉన్నారని గుర్తు చేశారు. ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు మరో రెండు నెలల్లో ప్రారంభం కానుందన్నారు. నగరంలో రోడ్లు, కాలువల పనులు టీడీపీ నేతలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకొచ్చిన చంద్రబాబు జిల్లాకు చేసిందేంటని ప్రశ్నించారు.శ్రీకాకుళం నగరాన్ని మరో నాలుగు నెలల్లో సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు.

తాను ఎన్నికల నుంచి తప్పుకుంటానని చెబితే ఈసారీ ప్రజలకు అండగా ఉండాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సూచించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు సాదు వైకుంఠరావు, అల్లు లక్ష్మీనారాయణ, టంకాల బాలకృష్ణ, కొండాల గణేష్, కొమరాజు అఫీస్‌నాయుడు, ఎండ రమేష్, వానపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ప్రత్యేక అలంకరణలో విజయదుర్గ



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాలవీధిలో విజయదుర్గా దేవి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

శ్రీకాకుళం/శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలో శనివారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రారంభం కానున్నాయి. తొలుత కాకివీధి అర్బన్ ఆరోగ్య కేంద్రంలో శిబిరం ప్రారంభం కానుంది. నగరపాలక సంస్థ పరిధిలో శనివారం నుంచి అక్టోబర్ 31 వరకు 16 జగనన్న ఆరోగ్య వైద్య శిబిరాలను నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. 4న ఖాజీపేట, 5న అరసవల్లి, 6, 7 తేదీల్లో పెద్దపాడు, 9న కిల్లిపాలేం, 10న డీసీసీ కాలనీ, 12న తోటపాలెం, 13న కిల్లిపాలేం, 16న ఫాజుల్‌బేగ్‌పేట, 17న చాపురం, 20న పుణ్యపువీధి, 26న చాపురం, 28న పాత్రునివలస, 30న ఆదివారంపేట, 31న కుశాలపురంలో శిబిరాలు నిర్వహిస్తారు. ఈ శిబిరాలను నగర కమిషనర్ ఓబులేసు, ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరావు పర్యవేక్షిస్తారు. ఇప్పటికే సర్వే 85 శాతం పూర్తయింది. 36,991 ఇళ్లు ఉండగా సుమారు 30 వేల ఇళ్లల్లో వివరాలు సేకరించారు.

గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

జి.సిగడాం: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వే జోరుగా చేపడుతున్నామని జి.సిగడాం, బాతువ పీహెచ్‌సీ వైద్యాధికారులు పొన్నాడ హరితాశ్రీ, అనుషా తెలిపారు. ఆనందపురం, జాడ గ్రామాల్లో శుక్రవారం సర్వే చేపట్టడంతోపాటు వైద్య పరీక్షలు చేశారు. శనివారం నుంచి ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్‌వైజర్లు పేడాడ సత్తిరాజు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

కందకాలతోనే అడవి పందుల నుంచి పంటలకు రక్ష

రణస్థలం: అడవి పందులతో పంటలను నష్టపోతున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి ఆర్.అప్పలనాయుడు, రణస్థలం ఇన్‌చార్జి ఎఫ్‌డీవో ఎస్.శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో తెలిపారు. రణస్థలం, లావేరు మండలాల్లోని కొండములగాం, వెల్పురాయి, కమ్మసిగడాం, దేవరాపల్లి, జి.జె.వలస, కొత్తకుంకాం, ఇజ్జుపురం గ్రామాల్లో రైతులు పండిస్తున్న మొక్కజొన్న, వేరుశనగ పంటలకు అడవి పందులు నష్టం చేకూర్చుతున్నాయన్నారు. నివారణ చర్యలుగా కొండ చుట్టూ, పంట భూములకు మధ్యలో కందకాలను తవ్వడం ద్వారా పందుల నుంచి పంటలకు రక్షణ కలుగుతోందని సూచించారు. కందకాలు తవ్వేందుకు ఎంపీడీవో, ఏపీవో, డ్వామా పీడీలను సంప్రదించాలన్నారు.

జి.సిగడాంలో పారిశుద్ధ్య పనులు



కాలువలో పూడిక తొలగిస్తున్న కార్మికులు

జి.సిగడాం: మండల కేంద్రం జి.సిగడాంలో సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ పర్యవేక్షణలో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువలో పూడికలు తొలగించారు. వీధులను శుభ్రం చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. పరిసరాలను అందరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సాహు, పాగిరి రాము, రమణ ఉన్నారు.

కూరగాయలు సాగుపై దృష్టి సారించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఏడాది పొడుగునా దిగుబడినిచ్చే కూరగాయలను మోడల్ విధానంలో సాగు చేయాలని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ లక్ష్మునాయుడు అన్నారు. కేశవరావుపేట గ్రామంలోని లీడ్ ఫార్మర్ గుణ్ణంనాయుడు వ్యవసాయ క్షేత్రంలో మోడల్ సాగు విధానాన్ని శుక్రవారం చేపట్టారు. యాజమన్య పద్ధతులు, రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగంపై అవగాహన కల్పించారు.